# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 25-09-2024** **సమయం : 1.20 గంటలు**

---

# ముఖ్యాంశాలు

1. **మేక్ ఇన్ ఇండియా కార్యక్రమం ఈ రోజుతో 10 సంవత్సరాలు పూర్తి కావడం పట్ల ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ సామాజిక మాధ్యమం వేదికగా హర్షం వ్యక్తం చేశారు.**
2. **విజయవాడకు సంభవించిన వరదల్లో రాష్ట్ర ప్రభుత్వం సమిష్టిగా పనిచేసిందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలిపారు.**
3. **కారుణ్య నియామకాలను చేపట్టేందుకు చర్యలు చేపట్టాలని రాష్ట్ర ఉపముఖ్యమంత్రి కె. పవన్ కల్యాణ్ అధికారులను ఆదేశించారు.**
4. **రాష్ట్రంలో పెట్టుబడులకు విస్తృత అవకాశాలున్నాయని రాష్ట్ర ఐటి మంత్రి నారా లోకేశ్ పేర్కొన్నారు.**
5. **రాష్ట్రంలో ఇటీవలి వరదల్లో ధృవపత్రాలను కోల్పోయిన వారికి ఉచితంగా ధృవపత్రాల నకళ్లను జారీచేయాలని ప్రభుత్వం అన్ని శాఖలను ఆదేశించింది.**

==========================

మేక్ ఇన్ ఇండియా కార్యక్రమం ఈ రోజుతో 10 సంవత్సరాలు పూర్తి కావడం పట్ల ప్రధానమంత్రి నరేంద్రమోదీ సామాజిక మాధ్యమం వేదికగా హర్షం వ్యక్తం చేశారు. 'మేక్ ఇన్ ఇండియా' దేశాన్ని తయారీ, ఆవిష్కరణల కేంద్రంగా మార్చిందని తెలిపారు. ఆర్థిక, తయారీ రంగాలలో సంస్కరణల వల్ల దేశ పురోగతి కొనసాగుతుందని, వికసిత్ భారత్ నిర్మాణానికి 'మేక్ ఇన్ ఇండియా' మరింత దోహద పడుతుందని పేర్కొన్నారు. మరోవైపు కేంద్ర వాణిజ్య శాఖ మంత్రి పీయూష్ గోయల్ మేక్ ఇన్ ఇండియా పై స్పందిస్తూ ఈ కార్యక్రమం అమలు ద్వారా విదేశాల నుంచి సెల్ ఫోన్ల దిగుమతులు 85% తగ్గాయని 2022-24 మధ్య తయారీ రంగంలో ఉద్యోగాలు 200% పెరిగాయని అన్నారు.

--------------------------

విజయవాడకు సంభవించిన వరదల్లో రాష్ట్ర ప్రభుత్వం సమిష్టిగా పనిచేసిందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలిపారు.ఎన్టీఆర్ జిల్లా విజయవాడ కలెక్టర్ కార్యాలయంలో వరద బాధితులకు ఆర్థిక సాయం అందజేసేందుకు ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఈ రోజు ఆయన మాట్లాడుతూ, వరద నీటిలో బాధితులకు అన్నిరకాల సాయం అందించామని చెప్పారు. విపత్తు సమయంలో అన్ని శాఖల సమన్వయంతో సమర్ధవంతంగా పనిచేశాయన్నారు.విరాళాల కోసం రాష్ట్రప్రజలంతా స్పందించారని, వరద బాధితులకు సాయం చేసేందుకు

అనేక మంది ముందుకొచ్చారని తెలిపారు. ముఖ్యమంత్రి సహాయనిధికి 400 కోట్ల రూపాయలు వచ్చాయని చంద్రబాబు తెలిపుతూ,

వాయిస్ (30 సెకన్లు)

---

కారుణ్య నియామకాలను చేపట్టేందుకు చర్యలు చేపట్టాలని రాష్ట్ర ఉపముఖ్యమంత్రి కె పవన్ కల్యాణ్ అధికారులను ఆదేశించారు. కారుణ్య నియామకం ద్వారా ఉద్యోగాల అంశంపై ఉప ముఖ్యమంత్రి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖలో కారుణ్య నియామకాల జాబితాలో ఉన్న వారిని నియమించే విషయమై రాష్ట్ర సాధారణ పరిపాలనశాఖ ఉన్నతాధికారులతో చర్చించాలని సూచించారు.

---

రాష్ట్రంలో పెట్టుబడులకు విస్తృత అవకాశాలున్నాయని రాష్ట్ర ఐటి మంత్రి నారా లోకేశ్ తెలిపారు. భారత పరిశ్రమల సమాఖ్య –సీఐఐ ఆధ్వర్యంలో ఈ రోజు విశాఖపట్నంలో నిర్వహించిన 'మౌలిక సదుపాయాల సదస్సులో మంత్రి పాల్గొని మాట్లాడుతూ, రాష్ట్రంలో పరిశ్రమలకు కావాల్సిన మౌలిక సదుపాయాల కల్పనకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామన్నారు. ప్రోత్సాహకాల కోసం ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటోందని చెప్పారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో పరిశ్రమలకు అనువైన వాతావరణం ఉందని, అన్ని జిల్లాలకు విమానాశ్రయాల ఏర్పాట్లు చేస్తున్నామని మంత్రి వివరించారు.

---

రాష్ట్రంలో ఇటీవలి వరదల్లో ధృవపత్రాలను కోల్పోయిన వారికి ఉచితంగా ధృవపత్రాల నకళ్లను జారీచేయాలని ప్రభుత్వం అన్ని శాఖలను ఆదేశించింది. వాహన రిజిస్ట్రేషన్ ధృవపత్రాలు, రిజిస్టర్డ్ డాక్యుమెంట్లు, ఆధార్ కార్డు, జనన, మరణ, వివాహం వంటి ధృవపత్రాల పోగొట్టుకున్నా, నాశనమైనా వాటి నకలు కాపీలను ఇవ్వాలని సూచించింది. ఇందుకోసం ప్రత్యేక శిబిరాలను నిర్వహించాలని, అందుకనుగుణంగా నిబంధనలను సవరించాలని రెవెన్యూశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆర్.పి. సిసోడియా ఉత్తర్వులు జారీచేశారు.

---

రాష్ట్రం నుంచి హజ్-2025 యాత్రకు వెళ్లే వారి దరఖాస్తుల గడువును హజ్ కమిటీ ఆఫ్ ఇండియా మరోసారి పొడిగించిందని రాష్ట్ర మైనార్టీ శాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 30 వరకు దరఖాస్తు చేసుకోవచ్చని, హజ్ యాత్రకు వెళ్లే వారికి లక్ష రూపాయల ఆర్థిక సాయం అందించనున్నామని పేర్కొన్నారు. 105 కోట్ల రూపాయలతో గుంటూరు, నంద్యాల, అనంతపురం జిల్లాల్లో సహాయక కేంద్రాలను ఏర్పాటు చేయనున్నట్టు ఆ ప్రకటలో తెలిపారు.

---

రైతులకు వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర చేనేత, జౌళి శాఖ మంత్రి సవిత తెలిపారు. శ్రీ సత్యసాయి జిల్లా పుట్టపర్తి మండలం నిడిమామిడి గ్రామంలో జిల్లా వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన "పొలం పిలుస్తోంది" కార్యక్రమంలో పుట్టపర్తి శాసనసభ్యులు సింధూర రెడ్డితో కలిసి మంత్రి సవిత పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, ఎన్డీయే కూటమి ప్రభుత్వం రైతులకు

ప్రాధ్యాన్యతనిస్తోందని అన్నారు. రైతుల సమస్యలను పరిష్కరించేందుకు 'పొలం పిలుస్తోంది' కార్యక్రమాన్ని చేపట్టామని, వ్యవసాయానికి అవసరమయ్యే డ్రిప్పులను రాయితీతో అందిస్తున్నామని తెలిపారు.

---------------------------

ఇంద్రకీలాద్రి దుర్గా మల్లేశ్వరస్వామి వారి దేవస్థానంలో నిర్వహించనున్న దసరా మహోత్సవాలకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని విజయవాడ పార్లమెంట్ సభ్యులు కేశినేని శివనాథ్ తెలిపారు. విజయవాడలో దసరా మహోత్సవములు –2024 గోడపత్రిక, ఆహ్వాన పత్రికను స్థానిక శాసనసభ్యులు సుజనా చౌదరితో కలిసి నిన్న ఆవిష్కరించారు. ఈ సందర్భంగా శివనాథ్ మాట్లాడుతూ, వచ్చే నెల 3వ తేదీ నుండి 12 వ తేదీ వరకు దసరా మహోత్సవాలు జరగనున్నాయని తెలిపారు. అక్టోబర్ 9వ తేదీన మూలా నక్షత్రం రోజున సరస్వతీ దేవి అలంకారం సందర్భంగా అమ్మవారికి రాష్ట్ర ప్రభుత్వం తరఫున ముఖ్యమంత్రి పట్టు వస్త్రాలను సమర్పించనున్నారని తెలిపారు.

---------------------------

రాష్ట్రంలోని ప్రస్తుత వాతావరణ పరిస్థితులను అమరావతిలోని భారత వాతావరణ కేంద్రం అధికారి ఎం.వెంకట్రావు కొద్దిసేపటి క్రితం ఆకాశవాణి విజయవాడ కేంద్ర ప్రాంతీయ వార్తావిభాగానికి తెలియజేస్తూ......

.....వాయిస్.... 27 సెకన్లు....

---------------------------

స్వచ్ఛ భారత్ స్ఫూర్తితో ఒంగోలు నగరాన్ని సుందరంగా తీర్చిదిద్దుతామని ఒంగోలు శాసనసభ్యులు డి. జనార్దన్ అన్నారు. ఒంగోలులో ఈ రోజు నిర్వహించిన స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ, గత స్వచ్ఛ భారత్, స్వచ్ఛ ఆంధ్రప్రదేశ్ కార్యక్రమాలలో ఒంగోలు నగరం పురస్కారాలను గెలుచుకుందని తెలిపారు. ఒంగోలు నగర సుందరీకరణ పనులను వేగవంతం చేస్తామన్నారు. అన్ని ముఖ్య కూడలి ప్రాంతాల్లో వ్యర్థ పదార్థాలతో రూపొందించిన కళాకృతులను ఏర్పాటు చేస్తామని తెలిపారు.

---------------------------

సమగ్ర మానవతావాదం అనే రాజకీయ తత్వాన్ని రూపొందించిన వ్యక్తి దీన దయాళ్ ఉపాధ్యాయ అని బిజెపి రాష్ట్ర అధికార ప్రతినిధి భానుప్రకాష్ రెడ్డి తెలిపారు. ఈరోజు తిరుపతిలో నిర్వహించిన పండిట్ దీన్ దయాల్ ఉపాధ్యాయ జయంతి కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ, స్వావలంబన ఆర్థిక వ్యవస్థ, గ్రామాభివృద్ధికి దీన్ దయాల్ ప్రాధాన్యతను ఇచ్చారని అన్నారు. పాశ్చాత్య భావనలపై భారతదేశం ఆధారపడ కూడదని చెప్పిన వ్యక్తుల్లో పండిట్ దీన్ దయ ఉపాధ్యాయ మొదటి వారని కొనియాడారు.

---------------------------

ప్రముఖ చలనచిత్ర గాయకులు ఎస్.పీ.బాలసుబ్రహ్మణ్యం వర్ధంతి ఈరోజు... తెలుగు చలన చిత్ర సంగీత ప్రపంచంలోనే కాకుండా దక్షిణాది సినీ ప్రపంచంలో తనదైన ముద్ర వేసిన శ్రీపతి పండితారాధ్యుల బాలసుబ్రమణ్యం 1946 జూన్ 4వ తేదీన అప్పటి శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరుజిల్లాలోని కోనేటమ్మపేట గ్రామంలో జన్మించారు. శ్రీశ్రీశ్రీ మర్యాద రామన్నచిత్రం ద్వారా తెలుగు సినిమా పరిశ్రమలోకి అడుగుపెట్టారు. తమిళ, కన్నడ, మలయాళ, హిందీ తదితర భాషల్లో వేలాది పాటలు పాడి... అనేక జాతీయ పురస్కారాలతో పాటు కేంద్రం ప్రభుత్వ ప్రతిష్ఠాత్మక పద్మశ్రీ... పద్మభూషణ్ పురస్కారాలను అందుకున్నారు. ఆయన మరణానంతరం కేంద్ర ప్రభుత్వం పద్మవిభూషణ్‌తో

గౌరవించింది. కాగా.. సెప్టెంబరు 25, 2020లో ఆయన తుది శ్వాస విడిచారు.

-------------------------

ప్రపంచ వ్యాప్తంగా ఔషధ తయారీ నిపుణుల సేవలను గుర్తించే ఉద్దేశ్యంతో ఈ రోజు ఔషధ నిపుణుల దినోత్సవం– PHARMASITS DAY నిర్వహిస్తున్నారు. టర్కీ దేశంలోని ఇస్తాంబుల్ లో 2009 వ సంవత్సరంలో జరిగిన ఇంటర్నేషనల్ ఫార్మస్యూటికల్ ఫెడరేషన్ కాంగ్రెస్ పిలుపు మేరకు ఈ కార్యక్రమం జరుగుతోంది. ఒక దేశ ఆరోగ్య రంగంలో ఫార్మసిస్టుల పాత్ర ఎంతో కీలకంగా ఉంటుంది. మన ఆరోగ్యం సక్రమంగా ఉండాలంటే ఔషధ నిపుణులు తమ మేధస్సుతో తయారు చేసే ఔషధాలు కీలక భూమిక పోషిస్తాయి. ఔషధాలను తయారు చేసి, అవి ఏ విధంగా ఉపయోగించాలో తెలియజేసి, ఆరోగ్యాన్ని సంరక్షించడంలో ఫార్మసిస్టులు ఎంత గానో తోడ్పడతారు.

======================